RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:218 | బుధవారం | 16 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

‘ఉస్మానియా’ పునరుద్ధరణలో

## సహకరించాలి

- ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్



2

## పోలీస్ స్టేషన్లలో గూండాల రాజ్యం

- కేసీఆర్ ఇంటిపై దాడికి తెగబడ్డారు.. మాపైనా ఉసిగొల్పారు
- ఠాణాలోనే నా పీఏ, పీఆర్‌వోలపై 15మందితో దాడులు చేయిస్తారా?
- ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయని దౌర్భాగ్యం
- కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసులు.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం
- ఢిల్లీ వేదికగా రేవంత్ సర్కారు అరాచకాలపై భగ్గుమన్న కేటీఆర్



2

తెలంగాణ కాంగ్రెస్‌కు

## కొత్త ఇంచార్జ్?

- మీనాక్షి నటరాజన్ స్థానంలో కొత్త నేత
- విదేశీ విద్య కోసం త్వరలో మీనాక్షి పయనం
- మరో రెండు నెలలు కొనసాగనున్న ప్రస్తుత ఇంచార్జ్?
- పరిశీలనలో సెంథిల్, చల్లకుమార్ పేర్లు
- ముకుల్ వాస్నిక్‌పైనా అధిష్ఠానం దృష్టి
- ముగ్గురిలో ఒకరికి బాధ్యతలు దక్కే అవకాశం

2





- నామినేటెడ్ పదవుల భర్తీలో కొత్త సమీకరణాలు
- సెప్టెంబరు నెలాఖరులోగా 50 కార్పొరేషన్లలో నియామకాలు
- జనాభా నిష్పత్తి ఆధారంగా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- గతంలో ప్రాతినిధ్యం దక్కని కులాలకు అవకాశాలు
- పార్టీ కోసం పనిచేసిన నేతలకే అధిష్ఠానం మొగ్గు
- పాతవారిలో కొందరికి పునరావకాశంపై ప్రతిపాదనలు

# గేమ్ ఛేంజర్‌గా కులగణన జాబితా!

**హైదరాబాద్, సెప్టెంబరు 15:**
తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీకి కులగణన జాబితా కీలకంగా మారుతోంది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ మార్గదర్శకాలు జారీ చేయడంతో, ప్రభుత్వ కులగణన నివేదికల ఆధారంగా పదవుల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. గతంలో పెద్దగా ప్రాతినిధ్యం దక్కని కులాలకు అవకాశాలు కల్పించడంతో పాటు, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన నేతలను ఎంపిక చేయాలని భావిస్తోంది.

**సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ**
తెలంగాణలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. సుమారు 50 కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల

మిగతా 2వ పేజీలో..

యూపీఐ ఛార్జీలపై

## కేంద్రం క్లారిటీ

- రూ.2 వేల వరకు యూపీఐ చెల్లింపులు ఉచితం
- పీ2పీ లావాదేవీలకు ఎలాంటి రుసుము లేదు
- చెల్లింపుదారు, స్వీకర్తపై ఛార్జీలు వద్దు
- బ్యాంకులు, చెల్లింపు సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే


4




## పసుపు నీళ్ల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

- నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దు
- పోలీసులకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు
- నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలి
- ఏడేళ్లలోపు శిక్ష సెక్షన్లపై కోర్టు ఆరా
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని సూచన

2



## పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- డీజీపీ ఆనంద్

3



విద్యకు ఎంత ఖర్చయినా

## వెనుకాడేది లేదు

- ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3

## దసరా నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు

3

2022 నాటి ఉద్యోగాల

## నోటిఫికేషన్ రద్దు

- నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

2

## అక్కడ ఘనం.. ఇక్కడ భయం



- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి

2

## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు
- అదనంగా ఏపీకి 2.25 లక్షలు.. తెలంగాణకు 1.25 లక్షలు
- ‘ఆవాస్ ప్లస్’ యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం
- రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం



3



## కుల పంచాయితీ పేరుతో అమానుషం

- మహిళపై దారుణ హింసాకాండ
- చట్టానికి అతీతంగా వ్యవహరించిన కుల పెద్దలు
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రచారం
- ఇప్పటివరకు కలుగజేసుకోని పోలీసులు
- స్వయం ప్రకటిత పెద్దలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

3

## తెలంగాణ సమర యోధులను స్మరించుకునేందుకే..

పర్యాటకను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



2




## క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం
- మండలిలో మొత్తం నాలుగు బిల్లులకు ఆమోదం
- ఆరు రోజుల పాటు కొనసాగిన శాసనమండలి సమావేశాలు
- 19 గంటల 20 నిమిషాల పాటు మండలి కార్యకలాపాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది.

**ఒకే పరిపాలన.. ఒకే చట్టం**

హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం తెలిపింది.

**నాలుగు బిల్లులకు ఆమోదం**

శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.

**ఆరు రోజులు.. 19 గంటల 20 నిమిషాలు**

తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

## మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర పోషించగా.. ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, మంత్రుల వ్యాఖ్యలపై తలసాని సీఎం పాత్రలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**సస్పెన్షన్లపై చురకలు**

మాక్ అసెంబ్లీలో తలసాని మాట్లాడుతూ.. "కొండా సురేఖ బిడ్డ నా గురించి మాట్లాడింది కాబట్టే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి తొక్కి వచ్చాను. ముఖ్యమంత్రినైన నన్ను, అదీ ఓ బీసీ బిడ్డను బర్తరఫ్ చేయక ఏం చేయాలి? కేబినెట్‌లో వేరే వాళ్లు కూడా ఉన్నారుగా.. కొండా సురేఖ బిడ్డ వాళ్ల గురించి కూడా మాట్లాడొచ్చుగా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ప్రతిపక్షాల ప్రశ్నలపై వ్యంగ్యం**

బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి తలసాని మాట్లాడుతూ.. "సబితక్క, సునీతక్క అంటే నాకు ఎంతో గౌరవం. కానీ, మీరు ఇవన్నీ సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశాను" అంటూ సటైరికల్‌గా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంత్రులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

**ప్రజల పక్షాన ప్రశ్నిస్తాం**

అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ తీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు.

## మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# అధికారం పోయింది.. అహంకారం పోలేదు

**మొదటిపేజీ తరువాయి**

**సభలో రేవంత్ చమత్కారం**

చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. ''మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా'' అంటూ చమత్కరించారు. అనంతరం పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. అధికార పక్ష సభ్యులు ఈ వ్యాఖ్యలను హర్షించారు.

**వాగ్వాదాల మధ్య వ్యాఖ్యలు**

శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక చర్చకు దారితీశాయి. ప్రజల తీర్పు, తాజా రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం సమర్థన వ్యక్తం చేస్తుండగా.. ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

# వేలాడుతున్న విస్తరణ కత్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అదనంగా మరో పదవి ఖాళీ అయింది. దీంతో మొత్తం మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఈ పదవుల కోసం ఆశావహుల పోటీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్య డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎవరికి అవకాశం కల్పించినా మరికొందరిలో అసంతృప్తి రేగే ప్రమాదం ఉండటంతో, విస్తరణకు ముందే ఆశావహులను బుజ్జగించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రెడ్డి వర్గం సీనియర్లకు ఆశలు**

మంత్రివర్గంలో చోటు కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రితో సహా ఇప్పటికే కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గానికి గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు స్థానాల్లోనూ అదే వర్గానికి అవకాశం కల్పిస్తే బీసీ, ఎస్టీ, లంబాడా వర్గాల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు సీనియర్ రెడ్డి నేతలను పక్కనపెడితే, వారు నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని అసమ్మతి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రాంతీయ సమీకరణాలూ కీలకమే**

ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల నేతలు పదవులను ఆశిస్తున్నారు. కొండా సురేఖ నిష్క్రమణతో బీసీ సామాజిక వర్గానికి చెందిన స్థానం ఖాళీ కావడం కూడా సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని పెంచింది. బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు వినిపిస్తుండగా.. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్రు నాయక్ ఆశావహులుగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు పదవుల భర్తీలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమన్వయం చేయడం అధిష్ఠానానికి సవాలుగా మారింది.

**ముందు బుజ్జగింపులపైనే దృష్టి**

రాబోయే స్థానిక సంస్థల, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. పదవులు దక్కని సీనియర్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తే, ఆ పరిణామం బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. దీంతో తొందరపడి విస్తరణ చేపట్టి కొత్త వివాదాలకు తెరతీయడం కంటే.. ముందుగా ఆశావహులను సముదాయించడంపైనే రేవంత్ దృష్టి సారించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించడం ద్వారా అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు జరగవచ్చని భావిస్తున్నారు.

**ఆ తర్వాతే కేబినెట్ విస్తరణ**

ఆశావహుల అసంతృప్తిని కొంతమేర తగ్గించిన తర్వాతే మంత్రివర్గ విస్తరణపై ముందడుగు వేయాలని రేవంత్ భావించే అవకాశం ఉంది. హైకమాండ్ ఆమోదం లభించినా, పదవులు దక్కని నేతలను దారికి తీసుకురావడం, సామాజిక సమతుల్యతను కాపాడటం ఆయన నాయకత్వానికి పరీక్షగా నిలవనుంది. మూడు పదవుల కోసం పోటీ పడుతున్న ఆశావహులు అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? లేక అసమ్మతి గళం వినిపిస్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది.

# ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో తాను శనివారం సమావేశమైనట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించామన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడంతోపాటు ఈ కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీంతోపాటు జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్(జేయూఏ)కు సంబంధించిన డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం.. ఇవాళ తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ విషయంలో దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తూ రీజనల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్ని రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై స్పందించిన ఆయన ఆదిలాబాద్‌లో జేయ□ఏను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారన్నారు. కాగా, ఈ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయి. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు ఏప్రిల్ 17న ఆదిలాబాద్ వియానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో 2.75 కిలోమీటర్ల రన్ వే నిర్మాణం అవసరమని నిర్ణయించారు. దీంతోపాట□ ఐఏఎఫ్ వద్ద 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా సదుపాయాలను కల్పిస్తామన్నారు. పౌర సేవలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ఒక సివిల్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎమ్మార్వో) సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుంది. వీటితోపాటు ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారు.

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

- రూపాయి జీతంతో పేదల కోసం పనిచేస్తున్న నేనా..
- అసెంబ్లీకి రాకుండా ఫార్మ్ హౌస్‌లో ఉన్న కేసీఆరా
- పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు
- మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :**

ప్రతిపక్షాలు 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు.. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయొద్దా అని మంత్రి నిలదీశారు. తాను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. 'ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా' అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.21 కోట్లT పొంది అసెంబ్లీకి, ప్రజలకు మొఖం చాటేసిన కే.సీ.ఆర్ రాజీనామా చేయరా అని హరీష్ రావును ప్రశించారు.

**అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్**

'అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు' అని స్పష్టం చేశారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ 'పొంగులేటి.. పొంగు' అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు.' పొంగులేటి.. పొంగు అని ఎందుకు పదేపదే అంటున్నారు.. ఎందుకు అంత భయం.. శుభకార్యంలో పాలు పొంగితే శుభం. కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంలో పొంగితే ఆ పొంగులో మీరే కాదు.. మీ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుంది' అని వ్యాఖ్యానించారు



# 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

శాసనసభలో 22A నిబంధనలపై జరిగిన చర్చతో ప్రజలకు ఎలాంటి ఉపశమనం లభించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సభ సాక్షిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని పారించారని మండిపడ్డారు. 22A అక్రమాలపై ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే తమకు మైక్ ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. తమను సభ నుంచి బయటకు పంపిన తర్వాత మంత్రి సుదీర్ఘ ప్రసంగంతో ఎదురుదాడికి దిగారే తప్ప, తాము లేవనెత్తిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేకపోయారని అన్నారు.

**సభను పక్కదోవ పట్టించారు..**

**క్షమాపణ చెప్పలేదు**

22A జాబితా కారణంగా రాష్ట్రంలో ఎన్ని లక్షల మంది ప్రజల ఆస్తులు నిలిచిపోయాయో స్పష్టం చేయాలని తాము ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానం దాటవేసిందని హరీశ్ రావు అన్నారు. అయితే, జాబితాను సక్రమంగా పరిశీలించకుండానే భూములను 22Aలో చేర్చామని మంత్రి చెప్పడం ద్వారా తప్పు జరిగిన విషయాన్ని సభలోనే అంగీకరించారని గుర్తు చేశారు. పొరపాటు జరిగిందని ఒప్పుకున్న మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పకపోగా తమపై ఎదురుదాడి చేయడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి ఇంటిని మాత్రం రాత్రికి రాత్రే 22A నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని, ఇదేనా ప్రజా ప్రభుత్వ పాలన అని ప్రశ్నించారు.

**మా మామ భూమిపై అవాస్తవాలు**

తమ కుటుంబ సభ్యుల భూములకు సంబంధించి మంత్రి పొంగులేటి సభలో అర్ధసత్యాలు మాట్లాడారని హరీశ్ రావు ఖండించారు. తన మామగారి భూమి గజ్వేల్ నియోజకవర్గంలో ఉంటే.. సిద్దిపేటలో ఉందంటూ మంత్రి తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఆ భూమికి 2010లోనే ఎన్‌ఓసీ వచ్చిందని, చెక్కుల ద్వారా చట్టబద్ధంగా లావాదేవీలు నిర్వహించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని స్పష్టం చేశారు.
ఎకరా రూ.15 కోట్ల విలువ అంటూ మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నిజంగా అంత విలువ ఉంటే ఎకరాను రూ.50 లక్షలకే ఇస్తామని, మంత్రి పొంగులేటినే వచ్చి కొనుగోలు చేయాలని సవాల్ విసిరారు.

**తెలంగాణ ఉద్యమకారులను అవమానించడమే**

తనను 'అగ్గిపెట్టె రావు' అంటూ మంత్రి పొంగులేటి సంబోధించడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటికి తెలంగాణ ఉద్యమ చరిత్ర, దాని తీవ్రత ఏమాత్రం తెలియదని విమర్శించారు. తాము ఉద్యమం చేసిన రోజుల్లో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనే ఉద్దేశంతో పోరాటాలు చేయలేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో భాగస్వాములైన వారిని, ఉద్యమకారులను ఇలాంటి వ్యాఖ్యలతో సంబోధించడం తెలంగాణ సమాజాన్ని, ఉద్యమ పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

# విద్యకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం
- ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. నవంబర్ 19 నుంచి లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్షవరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో అన్ని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా.. ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలు సాధించారా.. లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా.. ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌(సెస్)తో అధ్యయనం చేయించి డిటైల్డ్ రిపోర్టు తయారు చేయించాలని తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిళ్లపై చేసిన వ్యయం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య, వారికి అందించిన శిక్షణ, సాధించిన ఫలితాలపై ఆరా తీశారు. స్టడీ సర్కిళ్ల ద్వారా వస్తున్న ఫలితాలు, పెట్టుబడికి అనుగుణంగా వస్తున్న ప్రయోజనాలపై వివరణాత్మక అంచనా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన కోచింగ్ అందించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆయా కోర్సులను స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించేలా పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులపై కూడా చర్చించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రెటరి విజయేంద్ర బోయి, ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ సెక్రెటరి సంతోష్, ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు పాల్గొన్నారు.

## దసరా నుంచి కొత్త
# పింఛన్ల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలి వారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పించన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పించన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతోపాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికెట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కవకాలం అయితే సర్టిఫికెట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వాటి అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత ధ్రువీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కుల పంచాయితీ పేరుతో అమానుషం

**ఇబ్రహీంపట్నం /కోరుట్ల, సెప్టెంబర్ 15:**

కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామ సమీపంలో తమ సుఖాల కోసం, భవిష్యత్తు కోసం ఇద్దరు వ్యక్తులు తమ తమ కుటుంబాలను, పిల్లలను వదిలేసి వెళ్లారనే తీవ్ర ఆగ్రహంతో వారి ఆచూకీ కనుగొని బలవంతంగా గ్రామానికి రప్పించారు. పోలీసులకు అప్పగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన స్వయం ప్రకటిత పెద్దలు చట్టాన్ని పక్కనబెట్టి తామే న్యాయమూర్తుల్లా మారారు. ఊరవతల ఉన్న 'పూదోట మల్లన్న గుట్ట' పరిసర ప్రాంతాల్లో రచ్చబండను ఏర్పాటు చేసి సదరు మహిళపై కుల పంచాయితీ పేరుతో అమానుషంగా ప్రవర్తించినట్లు వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విచారణ పేరిట బాధితురాలు భయంతో బిగ్గరగా ఏడుస్తున్నా కాళ్లావేళ్లా పడి ప్రాధేయపడుతున్నా అక్కడున్న కుల పెద్దల్లో గానీ, గుమిగూడిన జనాల్లో గానీ రవ్వంత కనికరం కూడా కలగలేదు. మహిళను బలవంతంగా వివస్త్రను చేసి, అత్యంత అమానుషంగా ఆమె జననాంగాల్లో కారంపొడి నింపడమే కాక, తీవ్రమైన మంటను, గాయాన్ని కలిగించే జీడి గింజల రసాన్ని ఆమె మర్మాంగానికి పూసి అమానుషానికి పాల్పడ్డారు. కుల పెద్దల అండ చూసుకుని సాటి కుల సంఘం మహిళలే ఒక బ్యాచ్‌గా ఏర్పడి ఈ దారుణాన్ని అమలు చేయడం, అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్రవధ చేయడం సమాజపు నైతిక పతనానికి పరాకాష్టగా నిలిచింది. ఈ భయానక, అసభ్యకరమైన దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వారి వికృత చేష్టలకు, అనాగరిక పోకడలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలో ఓ వృద్ధుడు మహిళ, పురుషుడు ఇద్దరిపై సమానంగా వ్యవహరించాలని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తప్పు జరిగిందని భావిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వీడియోలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలించి పోలీసులు వాస్తవాలను వెలికి తీయాలి.

## పంతాలకు పోవద్దు..
# పదోన్నతులు కోల్పోవద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**

పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా 37మందికి పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డీజీపీ చొరవ తీసుకుని తన కార్యాలయంలో ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారం రోజుల సమయం ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డీజీపీ తెలిపారు. 'కేసులు వేసుకుని నష్టపోవద్దు.. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా.. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు' అని అన్నారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్నారు.

**కేసుల ఉపసంహరణకు ముందుకు**

డీజీపీతో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డీజీపీ¾కి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన 1991, 1995,1996 బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల నుండి అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డీజీపీ ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామీణ యువతకు పరిశ్రమలతో అనుసంధానం

- నిరుద్యోగ పరిష్కారానికి ఇదే చక్కటి మార్గం
- 19న కోదాడలో మెగా జాబ్‌మేళా
- ఎంపికైన అభ్యర్థులకు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు
- ఆఫర్ లెటర్లు అందజేయనున్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్/సూర్యాపేట, సెప్టెంబర్ 15 :**

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొనే కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యాసంస్థల ప్రతినిధులు, స్థానిక అధికారులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికీ,చదువు పూర్తయ్యాక పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేకమందిని కలిశానని చెప్పారు. మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజినీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదేపదే హైదరాబాద్‌కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలి. అదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశం అని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యాసంస్థలు అందిస్తున్న అర్హతలు, యువతలో ఉన్న ప్రతిభ...ఈ మూడింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రయత్నమని తెలిపారు. ఒకే ప్రాంగణంలో అనేక సంస్థల ప్రతినిధులను కలిసి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం గ్రామీణ నిరుద్యోగులకు కల్పించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఒక్కొక్కరికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు. అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతోపాటు సిమెంట్, తయారీ, సేవలు, ఐటీ, ఫార్మా, నిర్మాణ, వ్యాపార రంగాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి పరిశ్రమ జాబ్‌మేళాలో పాల్గొనేలా పరిశ్రమల శాఖ అధికారులు వ్యక్తిగతంగా సంప్రదించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ఆఫర్ లెటర్లు అందజేస్తారని వెల్లడించారు. జాబ్‌మేళాపై ఇప్పటికే సుమారు లక్షన్నర మంది ఉద్యోగార్థులకు బల్క్ సందేశాలు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్న క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పత్రికా ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా క్యూఆర్ కోడ్‌ను గ్రామస్థాయి వరకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

# మహిళా సంఘాలను ఏకీకృతం చేస్తున్నాం

- మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

**నిజామాబాద్, సెప్టెంబర్ 15 :**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకుందని, సంక్షేమం, అభివృద్ధి మంత్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ గత బీఆరఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తే ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలను ఏకీకృతం చేసి ఆ సంఘాలకు రుణాలపై బీమా, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు అందిస్తూ వ్యాపారులుగా మారుస్తున్నదని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వడమే కాక సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తున్నదని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు అవసరమైనచోట ఇస్తున్నామని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

# కుట్టు మిషన్ పథకం దరఖాస్తులకు గడువు 30

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల మంది అర్హులైన బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 30లోగా టీజీవోబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ మహిళలకు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడం, తద్వారా వారి కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. పథకానికి సంబంధించిన సమాచారం అర్హులైన ప్రతి మహిళకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**అమరావతి, సెప్టెంబరు 15:**

సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఊరట నిచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, జలశక్తి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు.

**దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లు**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరైన ఇళ్లకు అదనంగా మరిన్ని ఇళ్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**'ఆవాస్ ప్లస్'తో లబ్ధిదారుల ఎంపిక**

అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 'ఆవాస్ ప్లస్' మొబైల్ యాప్‌ను వినియోగించనున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హత ఉన్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రాథమికంగా రూ.1.20 లక్షలు, అదనంగా రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12 వేల సాయం ఉంటుందని వెల్లడించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని పెమ్మసాని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం 1.75 లక్షల ఇళ్లు కేటాయిస్తే 42 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది మరిన్ని ఇళ్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను రాబోయే 2-3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



## ఫ్రిజ్ పేలి నలుగురు మహిళలు సజీవ దహనం

- **బెలగావిలో సోమవారం ఘోర ప్రమాదం**
- **ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు మృతి**
- **మరో మహిళ కూడా మంటల్లో చిక్కుకుని మృతి**
- **ఇంటి యజమాని, బాలుడికి తీవ్ర గాయాలు**
- **ఫ్రిజ్ పేలడానికి కారణంపై అధికారుల దర్యాప్తు**

**బెలగావి, సెప్టెంబరు 15:**
కర్ణాటకలోని బెలగావి నగరంలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. చమౌలి గల్లీలోని రాజారాం ఇంట్లో ఫ్రిజ్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్నవారు బయటకు వచ్చేలోపే మంటలు వేగంగా వ్యాపించడంతో నలుగురు మహిళలు సజీవ దహనమయ్యారు.

**ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు**
ప్రమాదంలో శారద దమోలి (50), ఆమె కుమార్తెలు ప్రియా (28), గంగ (25)తో పాటు మరో మహిళ భారతి మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. మంటలు వేగంగా వ్యాపించడంతో బాధితులకు తప్పించుకునే అవకాశం లేకుండా పోయినట్లు తెలుస్తోంది. ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

**ఇంటి యజమాని, బాలుడికి గాయాలు**
ప్రమాదంలో ఇంటి యజమాని రాజారాంతో పాటు బాలుడు రోహన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో చిక్కుకున్న వారిని స్థానికులు, సహాయక సిబ్బంది బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజారాం, రోహన్ చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

**ప్రమాదానికి కారణంపై దర్యాప్తు**
ఫ్రిజ్ పేలడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ లోపం, ఫ్రిజ్‌లో సాంకేతిక సమస్య లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



## రాజౌరిలో ఉగ్ర కుట్ర భగ్నం

- **లష్కరే నెట్‌వర్క్‌కు షాక్**
- **ముగ్గురు ఉగ్ర సానుభూతిపరుల అరెస్ట్**
- **భారీగా ఐఈడీలు స్వాధీనం**
- **ఆశ్రయం, సహకారంపై ఆరా**
- **మరింత మంది కోసం భద్రతా బలగాల గాలింపు**

**జమ్ముకశ్మీర్, సెప్టెంబరు 15:**
జమ్ముకశ్మీర్‌లో భద్రతా బలగాలు లష్కరే ఉగ్రవాద సంస్థకు సంబంధించిన కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు వెల్లడించారు. రాజౌరి జిల్లాలో చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాద సానుభూతిపరులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా ఐఈడీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


**ఆశ్రయం కల్పించినట్లు అనుమానం**
అరెస్టయిన వ్యక్తులు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడంతో పాటు వారి కదలికలకు సహకరించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదులతో వారికి ఉన్న సంబంధాలు, అందించిన సహకారం తదితర అంశాలపై అధికారులు విచారణ చేపట్టారు.

**ఐఈడీలపై దర్యాప్తు**
స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, వాటిని ఎక్కడ వినియోగించేందుకు సిద్ధం చేశారు అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. నిందితుల విచారణ ద్వారా లష్కరేకు చెందిన మరికొందరు సానుభూతిపరులు, సహాయకుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. రాజౌరి పరిసరాల్లో మరిన్ని తనిఖీలు నిర్వహిస్తూ ఉగ్ర నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

## ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- **19 సాయంత్రం వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు**
- **మేనేజ్‌మెంట్ కోటా ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు కూడా విడుదల**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును 202627 విద్యా సంవత్సరానికి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేవనఆర్య□హెచవఎస్) మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 19న సాయంత్రం 4 గంటల లోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. చేరే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని యూనివర్సిటీ తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటల లోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించి అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 202627 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ 15 నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో తమ అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించింది.



# యూపీఐ ఛార్జీలపై కేంద్రం క్లారిటీ

- **రూ.2 వేల వరకు యూపీఐ చెల్లింపులు ఉచితం**
- **పీ2పీ లావాదేవీలకు ఎలాంటి రుసుము లేదు**
- **చెల్లింపుదారు, స్వీకర్తపై ఛార్జీలు వద్దు**
- **రూపే డెబిట్ కార్డు అర్హత చెల్లింపులకూ మినహాయింపు**
- **బ్యాంకులు, చెల్లింపు సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే**

**హైదరాబాద్, సెప్టెంబరు 15:**
యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధిస్తారన్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌తో స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. రూ.2 వేల వరకు జరిగే నిర్దిష్ట యూపీఐ చెల్లింపులపై చెల్లింపుదారు, చెల్లింపు స్వీకర్త నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుమూ వసూలు చేయకూడదని బ్యాంకులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

**పీ2పీ లావాదేవీలు యథాతథంగా ఉచితం**
ఒక వ్యక్తి మరో వ్యక్తికి యూపీఐ ద్వారా నగదు బదిలీ చేసే పీ2పీ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించకూడదనే విధానం కొనసాగనుంది. వ్యక్తిగత అవసరాల కోసం యూపీఐ వినియోగించే వారికి దీనివల్ల అదనపు భారం ఉండదు.

**రూపే చెల్లింపులకూ మినహాయింపు**
రూపే డెబిట్ కార్డు ద్వారా నిర్వహించే అర్హత కలిగిన చెల్లింపులపైనా ఎలాంటి రుసుము విధించకూడదని తాజా మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు సమాచారం. బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో రోజువారీ కొనుగోళ్లు, సేవల చెల్లింపులు, వ్యక్తిగత నగదు బదిలీలకు యూపీఐపై ఆధారపడే వినియోగదారులకు ఊరట లభించనుంది.




# చిన్నారుల భద్రతపై మెటా కఠిన చర్యలు

- **అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం**
- **కేంద్ర ఒత్తిడితో విధానాల్లో మార్పులు**
- **దుర్వినియోగాన్ని గుర్తించేందుకు నిఘా పెంపు**
- **అనుచిత కంటెంట్‌పై మరింత కఠిన వైఖరి**
- **ఫిర్యాదులపై వేగంగా స్పందించేలా చర్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:**
సామాజిక మాధ్యమాల్లో చిన్నారుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు మెటా కీలక మార్పులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిన్నారులపై దుర్వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించిన సందర్భాల్లో పోలీసులకు నేరుగా సమాచారం అందించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడి, సూచనల నేపథ్యంలో ఈ చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

**పోలీసులకు చేరనున్న సమాచారం**
ఇప్పటివరకు అంతర్గత పరిశీలన, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటున్న మెటా.. ఇకపై అవసరమైన సందర్భాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు సంస్థలకు సమాచారం వేగంగా అందే అవకాశం ఉంటుంది.

**అనుచిత కంటెంట్‌పై నిఘా**
పిల్లలను లక్ష్యంగా చేసుకుని జరిగే దుర్వినియోగం, వేధింపులు, అనుచిత కంటెంట్ వ్యాప్తిని అడ్డుకోవడంపై సంస్థ దృష్టి సారించనుంది. అనుమానాస్పద ఖాతాలు, కార్యకలాపాలను గుర్తించే సాంకేతిక వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగించే అవకాశం ఉంది. అయితే ఏయే సందర్భాల్లో పోలీసులకు సమాచారం ఇస్తారు, ఎలాంటి విధానంలో నివేదిస్తారు అనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి.




# యూపీఐ ఛార్జీలపై రాజకీయ దుమారం

- **రూ.2,000 దాటిన లావాదేవీలపై ఎండీఆర్‌కు అనుమతి ఇచ్చారన్న రాహుల్**
- **పరిమాణంలో 5 శాతమే.. విలువలో 65 శాతం వాటా**
- **వ్యాపారులపై భారం.. చివరికి వినియోగదారులపైనే ప్రభావమని వ్యాఖ్య**
- **జీరో ఎండీఆర్ విధానాన్ని మార్చేందుకు కేంద్రం మార్గం సుగమం చేసిందని ఆరోపణ**
- **ఛార్జీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:**
యూపీఐ లావాదేవీలపై ఛార్జీల విధింపునకు కేంద్ర ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) విధించేందుకు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది.
తాజా ఆదేశాల ప్రకారం.. రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులు, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ఛార్జీలు విధించకూడదు. అయితే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు లావాదేవీ మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు లేవు.

**'ఎక్స్'లో రాహుల్ గాంధీ ఆరోపణలు**
''మోదీ ప్రభుత్వం యూపీఐపై ఫీజులు విధించేందుకు నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. ఇప్పుడు రూ.2,000కు మించిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించవచ్చు. ఇలాంటి లావాదేవీలు పరిమాణం పరంగా కేవలం 5 శాతం ఉన్నప్పటికీ.. యూపీఐ మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయి'' అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

**'భారం వినియోగదారులపైనే'**
యూపీఐ వినియోగదారుల నుంచి నేరుగా ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వ్యాపారులపై పడే ఛార్జీల భారం చివరికి వినియోగదారులపైనే పడుతుందని రాహుల్ గాంధీ అన్నారు. వ్యాపారులు ఆ భారాన్ని ధరల పెంపు ద్వారా వినియోగదారుల నుంచి రాబట్టే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అమెరికాకు చెందిన పేమెంట్ కంపెనీలు భారత్‌లో అమలవుతున్న జీరో ఎండీఆర్ విధానాన్ని చాలాకాలంగా వ్యతిరేకిస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆరోపించారు.



# రష్యా చమురుపై భారత్‌కు అమెరికా షాక్?

- **భారీ సుంకాలకు అమెరికా సిద్ధం**
- **భారత్ పేరును బిల్లులో చేర్చాలని డెమోక్రటిక్ సభ్యుల ప్రతిపాదన**
- **సెనెట్‌లో ఇప్పటికే 86–11 ఓట్లతో ఆమోదం**
- **చైనా, టర్కియే సహా పలు దేశాలకూ ముప్పు**
- **అధ్యక్షుడికి విస్తృత సుంకాల అధికారం కల్పించే నిబంధన**
- **భారత్-అమెరికా వాణిజ్యంపై ప్రభావం చూపే అవకాశం**

**వాషింగ్టన్, సెప్టెంబరు 15:**
రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించే దిశగా అమెరికా అడుగులు వేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా రూపొందించిన కొత్త ఆంక్షల బిల్లును అమెరికా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సెనెట్‌లో ఆమోదం పొందిన ఈ బిల్లులో భారత్ పేరును నేరుగా చేర్చాలని డెమోక్రటిక్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు ప్రతిపాదించారు.

**సెనెట్‌లో 86–11తో ఆమోదం**
దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరుతో తీసుకొచ్చిన రష్యా, ఇరాన్ ఆంక్షల బిల్లుకు సెనెట్ 86-11 ఓట్లతో ఆమోదం తెలిపింది. ప్రస్తుత బిల్లు రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాల పేర్లను నేరుగా పేర్కొనలేదు. రష్యా నుంచి చమురు, సహజవాయువు దిగుమతి చేసుకునే ఐదు అతిపెద్ద దేశాలపై చర్యలు తీసుకునేలా నిబంధనలు ఉన్నాయి.

**భారత్‌తో పాటు పలు దేశాల పేర్లు**
డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి స్టేనీ హోయర్ చేసిన ప్రతిపాదనలో రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్న దేశాల జాబితాలో భారత్‌తో పాటు చైనా, టర్కియే, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, కజకిస్థాన్, కిర్గిస్థాన్‌లను చేర్చాలని సూచించారు. ఈ దేశాలు నిబంధనల పరిధిలోకి వస్తే రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా నుంచి తీవ్ర వాణిజ్య ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉంది.



**అధ్యక్షుడికి విస్తృత అధికారాలు**
రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే నిబంధన కూడా బిల్లులో ఉంది. ఈ అధికారాలకు సంబంధించిన 113వ సెక్షన్‌ను తొలగించాలని మరో డెమోక్రటిక్ పార్టీ నేత ప్రతిపాదించారు. ప్రతినిధుల సభలో సవరణలపై జరిగే చర్చ అనంతరం బిల్లు తుది రూపం ఎలా ఉంటుందన్నది కీలకంగా మారనుంది.

**భారత్‌పై ప్రభావం ఎంత?**
ప్రతినిధుల సభ ఆమోదం, అధ్యక్షుడి సంతకం తర్వాత బిల్లు చట్టంగా మారుతుంది. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందే ప్రక్రియను పూర్తి చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. చట్టం అమల్లోకి వస్తే రష్యాతో ఇంధన వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా ఆర్థిక ఒత్తిడి పెరగవచ్చు. ముఖ్యంగా భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలు, రష్యా నుంచి చమురు దిగుమతులు, ఇంధన ధరలు, అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే భారత్ పేరును తుది చట్టంలో చేర్చుతారా, సుంకాల పరిధి ఎంత ఉంటుంది అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# విద్యార్థుల కోసం సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్

- కరీంనగర్‌లో నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం ఉదయం 9 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో సత్య గౌర చంద్ర దాస స్వామీజీ తదితరులు పాల్గొననున్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం తొలుత కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. కార్యక్రమానికి లభించిన స్పందనతో మధిర, మంథని, మంచిర్యాల ప్రాంతాల్లో



సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్‌లో మరో కిచెన్‌ను సిద్ధం చేశారు. కరీంనగర్ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ తదితర నియోజకవర్గాల్లోని 17 మండలాల పరిధిలో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) సహకారంతో విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన మెనూను రూపొందించారు. సోమవారం ఇడ్లీ–సాంబార్, మంగళవారం పూరి–ఆలు కుర్మా, బుధవారం దోశ–చట్నీ, గురువారం ఉప్మా–చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, శనివారం బోండా–చట్నీ అందించనున్నారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తారు. విద్యార్థులు ఉదయం ఆకలితో పాఠశాలకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

## విజన్ హైస్కూల్ లో హిందీ దివస్




**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

రేకుర్తి విజన్ హైస్కూల్ లో హిందీ దివస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులను స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందీ భాష మన జాతీయ భాష అని, భారత దేశంలో అత్యధికంగా ప్రజలు మాట్లాడుతున్న భాష హిందీ భాష అని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యధికంగా మాట్లాడుతున్న భాషలలో హిందీ భాష మూడో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, టీచర్స్ పాల్గొన్నారు.

## వాగు ఉధృతితో అర్కండ్లకు రాకపోకలు బంద్



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శంకరపట్నం మండలం అరకండ్ల గ్రామానికి రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలోని వాగు వర్షాకాలంలో ప్రతిసారీ ఉప్పొంగడంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా వాగుపై శాశ్వత వంతెన నిర్మించకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. గతంలో వాగు ఉధృతంగా ప్రవహించిన సమయంలో కార్లు, ప్రజలు వాగులో చిక్కుకున్న ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాగుపై శాశ్వత వంతెన నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలని అరకండ్ల గ్రామస్థులు కోరుతున్నారు.





## కేశవపట్నం వాగుకు జలకళ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి శంకరపట్నం మండలం కేశవపట్నం వాగు ఉప్పొంగి ప్రవహించింది. మొన్నటివరకు ఎండిపోయిన వాగు ఒక్క వర్షానికే జలకళ సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాగులోకి నీరు చేరడంతో పరిసర వ్యవసాయ బావుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాగుకు, వర్షాభావంతో ఎండిపోతున్న వరి నాట్లకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

## బాలికను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మైనర్ బాలికను వివాహం చేసుకుంటానంటూ వేధిస్తున్నాడన్న ఫిర్యాదుపై కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ రేకుర్తికి చెందిన నగుర్ రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడు నగుర్ రవిని పోలీసులు అరెస్ట్ చేసి, మంగళవారం (15-09-2026) న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలికల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

## ముగిసిన మండల స్థాయి ఎంపిక పోటీలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

స్థానిక జడ్పీహెచ్ఎస్ కేశవపట్నం పాఠశాలలో మంగళవారం (15-09-2026) అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడల మండల స్థాయి ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల క్రీడా



కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భక్తురాజ్ కుమార్, వాసుదేవ్, అంజలి, జగబ్బీర్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ధోనే వెంకటేశ్వరరావు



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి గ్రామానికి చెందిన ధోనే వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనను ఘనంగా సన్మానించారు. పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బెజ్జంకి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుకు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి పదవి లభించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు కత్తి రమేశ్, పాక్స్ డైరెక్టర్లు ఆడుకుని నర్సింగరావు, గంగాధర రామచంద్రం, ఇఖ్కిల్ల ఐలయ్య, పర్ష సంతోష్, బండి వేణు, ఆయిలేని మహేందర్ రెడ్డి, పురుమ నారాయణ రెడ్డి, గుండని ఎల్లయ్య, సంగ రమేష్, గుబురే చంద్రం, కర్రావుల శంకర్, దొమ్మట శ్రీహరి, మహంకాళి మోహన్, నిషాని అనిల్, రొడ్డ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల అర్హుల జాబితాపై పరిశీలన



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** బెజ్జంకి మండలం దాచారం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త పింఛన్ల పథకానికి సంబంధించి వితంతువులు, వికలాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలు సమర్పించిన దరఖాస్తు పత్రాలను మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్ పరిశీలించారు. స్థానిక సర్పంచ్ బైర మానస రాజేందర్‌తో కలిసి అర్హత ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పత్రాలను పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే పింఛన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ దీటి బాల నర్సు, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకు డు కొమ్మెర రవీందర్ రెడ్డి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం మంత్రి పొన్నం ప్రభా కర్, ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శిం చారు. రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## నిండుకుండలా రాసముద్రం చెరువు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కేశవపట్నం వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరదనీరు రాసముద్రం చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు పూర్తిగా నిండి మత్తడి దుంకుతుండటంతో రాసముద్రం జలకళను సంతరించుకుంది. చెరువు మత్తడి దుంకుతున్న దృశ్యాన్ని చూసేందుకు గ్రామ ప్రజలు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మత్తడి వద్ద సందడి చేస్తూ చెరువు నిండిన దృశ్యాన్ని ఆస్వాదించారు. రాసముద్రం చెరువు కింద సాగు చేసే వేలాది ఎకరాల రైతులకు నీటి భరోసా లభించడంతో ఆనందం వ్యక్తమవుతోంది. చెరువు నిండటంతో రాబోయే సాగుకు నీటి కొరత ఉండదనే నమ్మకం రైతుల్లో నెలకొంది. అదేవిధంగా చెరువుపై ఆధారపడి జీవిస్తున్న 200కు పైగా మత్స్యకార కుటుంబాల్లోనూ సంతోషం వెల్లివిరిసింది. చెరువు నిండటంతో చేపల వేట, సాగునీటిపై ఆధారపడిన రైతులు, మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధిపై కొత్త ఆశలు చిగురించాయి

## డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయాలని బీజేపీ వినూత్న నిరసన

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



గుండ్లపల్లి–పొత్తూరు డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలో వినూత్న నిరసన చేపట్టారు. గుంతలమయమైన రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో కాగితపు పడవలను వదిలి నిరసన తెలిపారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని నినాదాలు చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాడుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 10న రాజీవ్ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి 30 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని నాయకులు తెలిపారు. రోడ్డు పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో గుండ్లపల్లి–పొత్తూరు డబుల్ రోడ్డు సమస్యపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మచ్చ సాయికృష్ణ, పుల్లెల జగన్మోహన్, ప్రశాంత్, అనిల్, తిరుపతి, హరీష్‌కుమార్, రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ఎస్టీయూ బెజ్జంకి మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు షాబుద్దీన్ (లక్ష్మీపూర్), మాధవిలత (బెజ్జంకి)లను ఘనంగా సన్మానించారు. బెజ్జంకి మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల ఎస్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని, సమాజ నిర్మాతలుగా ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పేదరికాన్ని రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని, దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామంచ రవీందర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్, బెజ్జంకి మండల శాఖ అధ్యక్షుడు నారోజు శంకరాచారి, ప్రధాన కార్యదర్శి యాలాల రాజమల్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నాగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, రాములు, విజయలత, సరిత తదితరులు పాల్గొన్నారు.



# పురాణ పురుషులు మల్లాది చంద్ర శేఖరులు

## నేడు అభినవ వ్యాస మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధానాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిందే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారావ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్రదాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్షసంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్లారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాములవారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్తావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవశాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం.వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టుబట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహుళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖరశాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా–లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతోత్తములు చంద్రశేఖర శాస్త్రి.. 96 ఏళ్ళ వయసులో 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నైజాం విముఖత.. 'పోలో'తో విలీనం



- నేడు హైదరాబాద్‌పై సైనిక చర్య ప్రారంభమైన రోజు
- భారత యూనియన్‌లో చేరేందుకు నిరాకరించిన ఏడో నిజాం
- రజాకార్ల ఆగడాలతో అట్టుడికిన హైదరాబాద్ సంస్థానం
- 1948 సెప్టెంబర్ 13న మొదలైన 'ఆపరేషన్ పోలో'
- సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో హైదరాబాద్ విలీనం

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు.**





పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724–1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉద్ధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు.

1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వి రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది.

**యథాతథ స్థితికి ఒప్పందం...**

వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగస్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు.

అయినా నైజాం, ఆయన నియమిత సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494







## తీవ్ర దుమారం రేపుతున్న
# స్పోర్ట్స్ యాప్ యాడ్

**న్యూయార్క్:** అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టాడు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.



## వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన
# ఆసీస్ కుర్రాడు

- జింబాబ్వేపై మ్యాట్ రెన్‌షా తొలి వన్డే శతకం
- 94 బంతుల్లో 109 పరుగులతో విధ్వంసం
- ఏడు ఫోర్లు.. మూడు సిక్సర్లతో మెరుపులు
- 107కే నాలుగు వికెట్లు పడినా ఆసీస్‌కు అండ
- ప్రపంచకప్ ముందు ఆరో స్థానానికి కొత్త ఆశ

**హరారే, సెప్టెంబర్ 15** : టెస్టుల్లో నిరాశపరిచాడు.. వన్డేల్లో మాత్రం బ్యాట్‌తో సమాధానం చెప్పాడు! మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసినా బంగ్లాదేశ్‌పై ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా.. జింబాబ్వేపై తొలి వన్డే శతకంతో చెలరేగిపోయాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో 94 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 109 పరుగులు సాధించి ఆసీస్‌కు భారీ స్కోరు అందించాడు. ఆస్ట్రేలియా టాపార్డర్ విఫలమవడంతో ఒక దశలో 107 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో 18వ ఓవర్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రెన్‌షా జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఆరంభంలో పరిస్థితులకు అనుగుణంగా ఆడిన అతడు ఆ తర్వాత భారీ షాట్లతో స్కోరు వేగాన్ని పెంచాడు.

### బ్రాడ్ ఎవాన్స్ ఓవర్‌లో సెంచరీ

బ్రాడ్ ఎవాన్స్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రెన్‌షా తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును పటిష్ఠ స్థితికి చేర్చాడు. రెన్‌షా మెరుపులతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పుపై కసరత్తు చేస్తున్న ఆస్ట్రేలియాకు రెన్‌షా ఇన్నింగ్స్ కొత్త ఆశలు కలిగించింది. ముఖ్యంగా ఆరో స్థానంలో దూకుడుగా ఆడగల బ్యాటర్‌గా అతడు తన అవకాశాలను బలపరుచుకున్నాడు. తొలి వన్డే సెంచరీతో అదరగొట్టిన రెన్‌షా ఇక జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసియా క్రీడల్లో 'యంగ్ పవర్'

## ఈ ఆరుగురిపైనే అందరి చూపు!



- వైభవ్ నుంచి అలెగ్జాండ్రా ఈలా వరకు యువ సంచలనాలు
- స్విమ్మింగ్‌లో యు జిడి.. ఒహోషిపై భారీ అంచనాలు
- జావెలిన్‌లో పతిరాగేకు స్వర్ణావకాశాలు
- జిమ్నాస్టిక్స్‌లో నిషియామా సత్తా చాటేనా?
- టెన్నిస్‌లో బంగారమే లక్ష్యంగా ఈలా బరిలోకి

**నాగోయా, సెప్టెంబర్ 15** : ఆసియా క్రీడల సమరానికి జపాన్‌లోని నాగోయా–ఐచి వేదిక సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ మెగా క్రీడా సంగ్రామంలో అనుభవజ్ఞులతోపాటు యువ సంచలనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న ఆరుగురు యువ క్రీడాకారులు ఈసారి పతకాలపై కన్నేశారు. చైనా స్విమ్మర్ యు జిడి నుంచి భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, ఫిలిప్పీన్స్ టెన్నిస్ తార అలెగ్జాండ్రా ఈలా వరకు వీరి ప్రదర్శనపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

### పదమూడేళ్లకే కొలనులో సంచలనం

చైనాకు చెందిన యు జిడి అతి చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో సంచలన ప్రదర్శనలతో దూసుకొచ్చింది. 2025 ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల వయసులోనే 4ఐ200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్యం సాధించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. వ్యక్తిగతంగా మూడు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాలు చేజార్చుకుంది. ఈ ఏడాది మార్చిలో 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అమెరికా ఒలింపిక్ ఛాంపియన్ రెగన్ స్మిత్‌ను ఓడించింది. ఆసియా క్రీడల్లో 200 మీటర్ల బటర్‌ఫ్లైతోపాటు 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో బరిలోకి దిగనుంది. వచ్చే నెలలో 14 ఏళ్లు పూర్తి చేసుకోనున్న యు జిడి భవిష్యత్‌లో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

### జావెలిన్‌లో పతిరాగే పవర్

శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరాగే ఈ ఏడాది జావెలిన్ త్రోలో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించాడు. డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన తొలి శ్రీలంక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూన్ 4న రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్లు విసిరి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. గత నెల జ్యూరిచ్‌లో 92.07 మీటర్లతో మరోసారి 92 మీటర్ల మార్కును దాటాడు. ఈ ఘనతను రెండుసార్లు అందుకున్న చరిత్రలో నాలుగో ఆటగాడిగా నిలిచాడు. ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ స్టార్ అర్షద్ నదీమ్ నుంచి అతడికి ప్రధాన పోటీ ఎదురుకానుంది. 92.97 మీటర్లతో ఆసియా రికార్డు నదీమ్ పేరిట ఉన్నప్పటికీ ప్రస్తుతం అతడి ఫామ్‌పై సందేహాలు ఉన్నాయి. భారత స్టార్ నీరజ్ చోప్రా గాయం కారణంగా బరిలో లేకపోవడంతో పతిరాగే స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నాడు.

### సొంతగడ్డపై ఒహోషి జోరు

జపాన్‌కు చెందిన 17 ఏళ్ల షిన్ ఒహోషి స్విమ్మింగ్‌లో కొత్త తరం స్టార్‌గా ఎదుగుతున్నాడు. 169 సెంటీమీటర్ల ఎత్తున్న ఒహోషి తనకు జంక్‌ఫుడ్ అంటే ఇష్టమని చెప్పడం విశేషం. అయితే కొలనులో మాత్రం అతడి వేగం ప్రత్యర్థులకు సవాల్‌గా మారుతోంది. ఈ ఏడాది 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో చైనా స్టార్ క్విన్ హైయాంగ్ ప్రపంచ రికార్డుకు సెకను కంటే తక్కువ తేడాతో చేరుకున్నాడు. అదే ప్రదర్శనతో జూనియర్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో క్విన్ హైయాంగ్‌తో మరోసారి అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాడు.

### వైభవ్ బ్యాట్ పేలుతుందా?

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు ఉన్నాయి. పురుషుల టీ20 క్రికెట్‌లో ఆసియా క్రీడల టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తున్న భారత్‌కు వైభవ్ కీలక ఆటగాడిగా మారనున్నాడు. ఐపీఎల్ 2026లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన వైభవ్.. ఆ ప్రదర్శనతో ఇంగ్లండ్ పర్యటనకు భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే రెండు సిక్సర్లు బాదాడు. అనంతరం జింబాబ్వేపై 18 బంతుల్లో తొలి టీ20 అంతర్జాతీయ అర్ధసెంచరీ సాధించాడు. ఆ తర్వాత 49 బంతుల్లో 81 పరుగులతో మరో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లోనూ అతడి బ్యాట్ నుంచి అలాంటి మెరుపులనే అభిమానులు ఆశిస్తున్నారు.

### జిమ్నాస్టిక్స్‌లో నిషియామా మెరుపులు

జపాన్‌కు చెందిన 16 ఏళ్ల మిసా నిషియామా సీనియర్ స్థాయిలోకి అడుగుపెట్టిన వెంటనే తన ప్రతిభతో ఆకట్టుకుంది. 2025లో జూనియర్ ఫ్లోర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అనంతరం ఎన్‌హెచ్‌కే ట్రోఫీలోనూ స్వర్ణం సాధించింది. చిన్నతనంలో బ్రెజిలియన్ జియు--జిట్సుపై ఆసక్తి చూపిన నిషియామా ఐదేళ్ల వయసులో జిమ్నాస్టిక్స్ శిక్షణ ప్రారంభించింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో జపాన్‌కు పతకం అందించాలన్నది ఆమె లక్ష్యం. 1964 తర్వాత ఈ విభాగంలో జపాన్‌కు పతకం దక్కకపోవడంతో ఆమెపై భారీ ఆశలు ఉన్నాయి.

### ఈలా గురి.. ఈసారి బంగారమే

ఫిలిప్పీన్స్‌కు చెందిన అలెగ్జాండ్రా ఈలా టెన్నిస్‌లో యువ సంచలనంగా ఎదుగుతోంది. ఈ ఏడాది తొలి డబ్ల్యూటీఏ టైటిల్‌ను సాధించడంతోపాటు వింబుల్డన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గత నెల వాషింగ్టన్ టైటిల్ సాధించే క్రమంలో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగులాను ఫైనల్లో ఓడించింది. నవోమీ ఒసాకా, ఎలీనా స్విటోలినా, లేలాహ్ ఫెర్నాండెజ్, జెంగ్ క్విన్‌వెన్ వంటి ప్రముఖులపైనా విజయాలు సాధించింది. కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ 18వ ర్యాంకుకు చేరుకున్న ఈలా.. గత హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 18 ఏళ్ల వయసులోనే కాంస్యం సాధించింది. సెమీఫైనల్లో జెంగ్ చేతిలో ఓడిపోయిన ఆమె ఈసారి ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో ఉంది. గత ఏడాది సీ గేమ్స్‌లోనూ స్వర్ణం సాధించిన ఈలా.. ఇప్పుడు ఆసియా క్రీడల బంగారంపై గురిపెట్టింది.

# ఆసియా కప్ దెబ్బకు ర్యాంకింగ్స్ తారుమారు!

- అగ్రస్థానంలో తెలుగమ్మాయి శ్రీ చరణి
- 804 పాయింట్లతో మరింత పటిష్టం
- రెండో ర్యాంకుకు దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్‌లో షెఫాలీకి ఆరో స్థానం
- ర్యాంకింగ్స్‌లో భారత అమ్మాయిల జోరు



**దుబాయ్, సెప్టెంబర్ 15** : ఆసియా కప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. మహిళల ఆసియా కప్–-2026లో అద్భుతంగా రాణించిన భారత క్రికెటర్లు తాజా ర్యాంకింగ్స్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా తెలుగమ్మాయి ఎన్. శ్రీ చరణి బౌలింగ్‌లో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగా.. దీప్తి శర్మ రెండో స్థానానికి దూసుకెళ్లింది. శ్రీలంకతో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో శ్రీ చరణి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆమె అంతర్జాతీయ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 804 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకుంది. ఈ ప్రదర్శనతో కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్న శ్రీ చరణి.. భారత మహిళల క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచిన దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగమించింది. నాలుగు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. దీంతో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలి రెండు స్థానాల్లో భారత బౌలర్లే నిలవడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆసియా కప్‌లో పరుగుల వరద పారించిన షెఫాలీ.. కీలక మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్‌తో భారత్‌కు బలంగా నిలిచింది. స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచింది. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ షెఫాలీ వర్మ దూసుకెళ్తూ కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకుంది. ఆసియా కప్ ట్రోఫీని సొంతం చేసుకోవడమే కాకుండా.. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో భారత క్రీడాకారిణులు అగ్రస్థానాల వైపు దూసుకెళ్లడం టీమిండియా ఆధిపత్యాన్ని చాటుతోంది.

## 'ది ప్యారడైజ్'తో సంపూర్ణేష్ బాబు కొత్త ప్రయాణం

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. సినిమాలో నాని స్నేహితుడి పాత్రలో నటిస్తున్న సంపూర్ణేష్ బాబు తన పాత్రతో పాటు భవిష్యత్ కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా తన సినీ ప్రయాణంలో కీలక మలుపుగా నిలవనుందని సంపూర్ణేష్ బాబు తెలిపారు. ఇప్పటివరకు తనను కామెడీ, స్పూఫ్ పాత్రలతో ఎక్కువగా గుర్తించారని, 'ది ప్యారడైజ్'లో మాత్రం తనలోని నటుడిని పూర్తిగా ఆవిష్కరించే అవకాశం లభించిందన్నారు. ఇకపై సోలో హీరోగా కాకుండా కథలో ప్రాధాన్యం ఉన్న ప్రతినాయక పాత్రలు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు, కథను ముందుకు నడిపించే కీలక పాత్రలకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తన కెరీర్‌లో ఇకపై నటుడిగా విభిన్న కోణాలను ఆవిష్కరించడమే లక్ష్యమని సంపూర్ణేష్ బాబు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## 'మండాడి'కి కలెక్షన్ల వర్షం..




కంటెంట్ ఉంటే కటౌట్ తో పనిలేదని, కథలో దమ్ముంటే బాక్సాఫీస్ బద్దలవ్వడం ఖాయమని 'మండాడి' సినిమా మరోసారి నిరూపించింది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై, కేవలం మౌత్ టాక్ తోనే థియేటర్లలో ప్రభంజనం సృష్టిస్తున్న ఈ రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన అఫీషియల్ పోస్టర్ చూస్తే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో ఊచకోత కోస్తుందో స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఏకంగా 65 కోట్లకు పైగా గ్రాస్ (65+ Crores Worldwide Gross) వసూలు చేసి ట్రేడ్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేసింది. ఒక భారీ స్టార్ హీరో లేకుండానే, కేవలం బలమైన కథను నమ్ముకుని తీసిన ఈ సినిమా ఈ రేంజ్ కలెక్షన్లు రాబట్టడం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. కమెడియన్ స్థాయి నుంచి హీరోగా ఎదిగి, తనలోని ఇంటెన్స్ యాంగిల్ ను ఈ సినిమాలో నటుడు సూరి అద్భుతంగా పండించాడు. అలానే కమెడియన్ స్థాయి నుంచి హీరోగా ఎదిగిన సుహాస్ కూడా తనదైన శైలిలో విలనిజం పండించాడు. దర్శకుడు మదిమారన్ పుగజేంది రాసుకున్న గ్రిప్పింగ్ స్టోరీకి, జీవీ ప్రకాష్ కుమార్ పవర్ ఫుల్ మ్యూజిక్ తోడవడంతో థియేటర్లలో రోమాలు నిక్కబొడుచుకునే ఎక్స్ పీరియన్స్ దొరుకుతోంది. దీనికి తోడు టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' ఈ చిత్రాన్ని తెలుగులో ప్రెజెంట్ చేయడం, నిర్మాత ఎల్రెడ్ కుమార్ రాజీపడని నిర్మాణ విలువలు ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లాయి. వర్షంలో సూరి, సుహాస్ తలపడుతున్న ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ తో డిజైన్ చేసిన ఈ 65 కోట్ల కలెక్షన్ల పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కంటెంట్ ఈజ్ కింగ్ అని మరోసారి నిరూపించిన 'మండాడి', రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులను తిరగరాస్తుందో వేచి చూడాలి!

## రాయల్ లెహెంగాలో దిశా పటానీ..

### చూపుతిప్పుకోనివ్వని గ్లామర్

రాయల్ లుక్‌లో దిశా పటానీ తన అందంతో మెస్మరైజ్ చేస్తోంది. వెండి రంగు సున్నితమైన ఎంబ్రాయిడరీతో కూడిన లెహెంగా ధరించిన ఆమె, లోతైన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ చోలీతో గ్లామర్ టచ్ ఇచ్చింది. మెడలో ధరించిన భారీ బంగారు కుందన్ ఆభరణాలు ఆమె రూపానికి మరింత రాజసం తీసుకొచ్చాయి. తీక్షణమైన చూపులు, సహజంగా వదిలేసిన వేవీ హెయిర్‌స్టైల్ దిశా పటానీ లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. సంప్రదాయ హంగులకు తనదైన గ్లామర్‌ను జోడించిన ఈ రాయల్ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



## సైమా వేడుకల్లో ఐశ్వర్యా మీనన్.. మెస్మరైజింగ్ లుక్

ఎస్ఐఐఎంఏ తొలి రోజు వేడుకల్లో నటి ఐశ్వర్యా మీనన్ తన గ్లామరస్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెండి రంగు పూసలతో రూపొందించిన గౌన్‌లో మెరిసిన ఆమె చూపుతిప్పుకోనివ్వని అందంతో ఆకట్టుకుంది. గౌన్‌పై చేసిన సిల్వర్ ఎంబ్రాయిడరీ, పారదర్శక డిజైన్, వేలాడే పూసలు, సున్నితమైన ఈకల అలంకరణ ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ముందు వైపు ఇచ్చిన పోజ్‌తో పాటు అద్దంలో కనిపించిన పక్క కోణం కూడా ఫొటోల్లో హైలైట్‌గా నిలిచింది. ఈ వేడుక కోసం ఐశ్వర్యా మీనన్ ధరించిన ప్రత్యేక గౌన్‌ను అంకుర్ జే రూపొందించగా, అనహితా స్టైలింగ్ చేశారు. స్టైల్ టీమ్ సహకారంతో సిద్ధమైన ఈ లుక్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం ఆకట్టుకుంటున్నాయి.



## పింక్ అండ్ గోల్డ్ సిల్క్ చీరలో మంత్రముగ్ధులను చేస్తున్న నిధి అగర్వాల్



పింక్, గోల్డ్ రంగుల సిల్క్ చీరలో ఆమె సంప్రదాయ అందంతో ఆకట్టుకుంటోంది. చీరకు జోడించిన కళాత్మకంగా అలంకరించిన బ్లౌజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడలో ధరించిన సున్నితమైన ముత్యాల హారం ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని తీసుకొచ్చింది. సంప్రదాయ వస్త్రధారణకు ఆధునిక మెరుపును జోడించిన ఈ లుక్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చీర కట్టులో ఆమె ఇచ్చిన పోజులు ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. సింపుల్ ఆభరణాలతోనే అందాన్ని మరింత ఎలివేట్ చేసిన ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644